‘కణితి’.. క్రీడల్లో మేటి

జాతీయ స్థాయిలో రాణిస్తున్న కణితి హైస్కూల్ విద్యార్థులు ● ఎన్నో పతకాలు..బహుమతులు



కలెక్టర్ చేతులు మీదుగా పురస్కారం అందుకుంటున్న హెచ్ఎం, పీడీలు, విద్యార్థులు (ఫైల్)

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా, ఆటల పోటీల్లో కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటుతున్నారు. గత ఏడాది రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో రాణించి కణితి హైస్కూల్‌కు క్రీడా ప్రతిభా పురస్కారం అందించారు. 2023–24 విద్యా సంవత్సరంలో క్రీడల్లో రాణించి పాఠశాల విద్యార్థుల జాబితాలో కణితి హైస్కూల్ విద్యార్థులు టాపర్లుగా నిలిచారు. ఎక్కువ మంది రాష్ట్ర, జాతీయ స్థాయి ఆటల పోటీల్లో దుమ్మురేపి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ సంయుక్తంగా రూపొందించిన జాబితాలో 180 పాయింట్లతో కణితి హైస్కూల్ ప్రథమంలో నిలిచి గతనెల 29న నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడా ప్రతిభా పురస్కారాన్ని జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ చేతుల మీదుగా అందుకున్నారు.

10వ తరగతి చదువుతున్న జె.ప్రణతి, ఎ.హరికృష్ణ, 9వ తరగతి చదువుతున్న ఎం.దుర్గ, కె.దేవిలు జాతీయ స్థాయిలో ఈ ఏడాది జనవరి మొదటి వారంలో ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. వీరంతా రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలిచారు. వీరితో పాటు ఎం.దుర్గ, ఎస్.రిషిత, కె.దేవి, ఈ.సాయి, ఎ.నాని నెట్‌బాల్, బేస్‌బాల్ పోటీల్లో క్రీడా ప్రతిభను చాటుకొని ప్రథమ స్థానంలో బంగారు పతకాలు సాధించారు. అలాగే డి.చందన, ఎల్.భార్గవి, జె.ప్రణతి గోల్డ్ మెడల్, ఎస్.రోహిత్ నాయుడు డి.హేమంత్, జి.రాకేష్‌లు రజత పతకాలు దక్కించుకున్నారు. వీటితో పాటు త్రోబాల్, వాలీబాల్, కబడ్డీలో పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి కణితి హైస్కూల్‌ను టాప్‌లో నిలిపారు. ఇవే కాకండా త్రోబాల్ ఫెడరేషన్ నిర్వహించిన త్రోబాల్ పోటీల్లో ఇదే హైస్కూల్ నుంచి సుమారు 30 మంది విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి పతకాల పంట పండించారు.



రాష్ట్ర, జాతయ క్రీడా పోటీల్లో రాణించిన విద్యార్థులు, జ్ఞాపికలతో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు

పోలీస్ శాఖలో ఉద్యోగం లక్ష్యం...



క్రీడల్లో రాణించి పోలీస్ ఉద్యోగం సంపాదించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నా. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించి క్రీడల కోటాలో ఉద్యోగం సంపాదించడం, నిజాయతీగా పని చేసి తల్లిదండ్రులు, గురువులు గర్వపడేలా పని చేయడం నా అభిమతం. తండ్రి అప్పలరాజు వ్యాన్ డ్రైవర్, తల్లి దినసరి కూలి పనులు చేస్తోంది. వారి కష్టాన్ని గుర్తించాను. నేను స్థిర పడిన తరువాత వారిని బాగాచూసుకుంటా.

–మాడిశ దుర్గ, 9వ తరగతి

మర్చంట్ నేవీలో చేరతా..



తండ్రి నాగరాజు ప్రైవేటు కంపెనీలో రోజుకూలి. తల్లి కూడా ఓ షాపులో పని చేస్తోంది. వీరు కష్టపడితే తప్పా కుటుంబం గడవని పరిస్థితి. బాగా చదువుకొని మర్చంట్‌నేవీలో ఉద్యోగం చేయాలన్నదే నా కోరిక. క్రీడల్లో రాణించడం, తద్వారా స్పోర్ట్స్ కోటాలో మర్చంట్‌నేవీలో ఉద్యోగం సంపాదించడమే లక్ష్యం.

–జాగారపు ప్రణతి, పదో తరగతి

కుటుంబానికి అండగా ఉంటా



తల్లిదండ్రులు శ్రీను, నాగమణిల ప్రోత్సాహంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.మన్నాజీ, కె.నారాయణరావుల సహకారంతో చక్కగా చదువుకుంటూ, మరోపక్క ఆటల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని దేశానికి మంచి పేరు తేవాలని ఆకాంక్ష. పోలీస్ ఉద్యోగం సంపాదించి రజక వృత్తి మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబానికి అండగా నిలబడతా.

కోడమంచిలి దేవి, 9వ తరగతి

విద్యార్థుల పట్టుదలే కారణం



ప్రతీ విద్యార్థికి ఆటలాడడం అంటే ఇష్టమే. అయితే ఏదో ఒకటి రెండు క్రీడాంశాల్లో విద్యార్థి దృష్టి పెడతాడు. ఆ దిశలో కృషి పట్టుదల ఉంటే జాతీయ స్థాయిలోనే కాదు అంతర్జాతీయ స్థాయిలో కూడా సత్తా చాటే ప్రతిభ ఉంటుంది. ఇష్టపడి చదవడమే కాదు, ఇష్టంతో ఆడే విద్యార్థి తప్పకుండా రాణిస్తారని మా పాఠశాల విద్యార్థులు నిరూపిస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయులుగా మా ప్రోత్సాహం, శిక్షణ ఒక ఎత్తు, విద్యార్థులు చిత్తశుద్ధి, పట్టుదల మరో ఎత్తు.

–కె.నారాయణరావు, నెట్‌బాల్ కోచ్, కణితి హైస్కూల్ పీడీ

సోలార్ వినియోగం, రాయితీలపై సదస్సు నేడు

అగనంపూడి: సోలార్ వినియోగం, బ్యాంక్‌ల నుంచి వినియోగదారులకు అందే రాయితీలపై అగనంపూడి సీడబ్ల్యూసీలో శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు అవగాహనా సదస్సు ఏర్పాటు చేసినట్టు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ తెలిపారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన కార్యక్రమంలో భాగంగా సోలార్ వినియోగం పెంచడంతోపాటు వినియోగం వల్ల కలిగే లాభాలు, యూనిట్ ఏర్పాటునకు ప్రభుత్వం బ్యాంక్‌ల ద్వారా అందించే రాయితీలపై వివరిస్తామన్నారు.

జేవీవీ సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీతారాం తదితరులు

గాజువాక : జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న సైన్స్ సంబరాలు 2024 పోస్టర్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ గురువారం ఆవిష్కరించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం అభివృద్ధి చెందడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీకే పరశురామ్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని అభివృద్ధి చేసి బావి శాస్త్రవేత్తలను తయారు చేసేందుకు జన విజ్ఞాన వేదిక కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో గాజువాక మండల విద్యాశాఖాధికారులు విశ్వనాథం, సునీత, జిప్సా అధ్యక్షుడు భాస్కరరావు, ప్రతినిధులు గిరీష్ శ్రీనివాస్, కె.వి.సత్యనారాయణ, ఎం.రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జేసీఐ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై సెమినార్



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న రమ్య

గాజువాక : జేసీఐ వైజాగ్ స్టీల్ సిటీ శాఖ ఆధ్వర్యంలో గురువారం కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక చైతన్య మహిళా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాత్ వే టు పర్పస్ అనే అంశంపై సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ రమ్య ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన వివిధ సందేహాలను నివృత్తి చేయడంతోపాటు వివిధ అంశాలపై సమాచారం అందించారు. అనంతరం యువత ఎదుర్కొంటున్న సమస్యలపై వివరాలను సేకరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కామేశ్వరి, ప్రిన్సిపాల్ చంద్ర మహాలక్ష్మి, జేసీఐ అధ్యక్షుడు ధనుంజయ్, ప్రతినిధులు రవికుమార్, రమ, వి.లలిత తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతికి సంతాపం

అక్కిరెడ్డిపాలెం: వామపక్ష దిగ్గజం, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి భెల్ సీపీఎం కమిటీ సంతాపం తెలిపింది. భెల్ సిటూ నాయకులు జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ బీహెచ్‌పీవీని భెల్‌లో విలీనం చేసిన ఘనత ఏచూరిదేనన్నారు. సంతాపం తెలిపిన వారిలో ఎస్.జగన్నాథరావు, కె.విజయ్‌కుమార్, కె.నారపురెడ్డి, ఎస్.అప్పారావు, జి.రాంబాబు, ఆర్.జనార్దనరావు, పి.శివరాం, జి.అచ్చన్నాయుడు తదితరులు ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌ను తక్షణం సెయిల్‌లో విలీనం చేయడం అంశంపై రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కేంద్ర ఉక్కు మంత్రిని కలిసేందుకు జీవీఎంసీ తీర్మాణం చేయాలని 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు నగర మేయర్ హరి వెంకట కుమారిని కోరారు. గురువారం ఆయన మేయర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ ప్రమాద స్థితిలో ఉందన్నారు. రోజుకు 21 వేల టన్నులు ఉత్పత్తి చేయాల్సి ఉండగా ప్రస్తుతం 5 వేల టన్నులకు పడిపోయిందన్నారు. మూడు బ్లాస్ట్‌ఫర్నేస్‌లలో రెండు మూతపడ్డాయన్నారు. మరికొన్ని కీలక విభాగాలను మూసివేసేందుకు స్కీం చేశారన్నారు. ఈ పరిస్థితుల్లో జీవీఎంసీ తక్షణం ప్లాంట్‌ను రక్షించటానికి అన్ని చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగా ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపటంతో పాటు ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, రూ. 5 వేల కోట్ల వర్కింగ్ క్యాపిటల్ మంజూరు చేయాలని తీర్మానం పెట్టాలని వినతిపత్రంలో కోరారు.

రిటైనింగ్ వాల్‌లో పెరిగిన చెట్టు తొలగింపు



గుబురుగా పెరిగిన రావిచెట్టును తొలగిస్తున్న ఆర్అండ్‌బీ అధికారులు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ క్రాసింగ్ వంతెన రిటైనింగ్ వాల్‌లో ఏళ్లనుంచి గుబురుగా పెరిగిన రావిచెట్టును రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ అధికారులు గురువారం తొలగించారు. రెండు రోజుల క్రితం ‘సాక్షి’ దినపత్రికలో ‘మేల్కొంటే ముప్పే’ కథనం వెలువడంతో ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్, అసిస్టెంట్ ఇంజినీర్ ఉదయ్‌లు వంతెన రిటైనింగ్ వాల్‌కు, శ్లాబ్‌కు మధ్యలో బలంగా పెరిగిన చెట్టును వేళ్లతో తొలగింపజేశారు.

సోలార్ రూఫ్ టాప్‌లపై అవగాహన



సోలార్ రూఫ్ టాప్‌లపై అవగాహన కల్పిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీకే నాయుడు

పెదగంట్యాడ: ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన అనేది భారతదేశంలోని గృహాలకు అతి తక్కువ విద్యుత్ బిల్లులను అందించడానికి ఉద్దేశించిన కేంద్ర ప్రభుత్వ పథకం అని ఏపీ ఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జికూటివ్ ఇంజనీర్ బీకే నాయుడు తెలిపారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధి నెల్లిముక్కు రామాలయం వద్ద గురువారం గ్రామస్తులకు ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా లబ్ధిదారులు తమ గృహాలపై కప్పుల పై సోలార్ ప్యానెల్‌లను ఏర్పాటు చేసుకోవడానికి సబ్సిడీ ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో ఇంటికి తక్కువ ఖర్చుతో సౌర విద్యుత్ వెలుగులు పొందే ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. దీని ద్వారా పవర్ కట్ సమస్య కూడా ఉండదన్నారు. సామాన్యులకు విద్యుత్ చార్జీలు భారం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. తీసుకోదలచిన క్యూఆర్ కోడ్ ద్వారా కానీ ఏపీ ఈపీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా, పీఎం సూర్య ఘర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జికూటివ్ ఇంజనీర్ కేవీ త్రినాథ్, ఏఈ దుర్గాప్రసాద్, బ్యాంకర్స్, సోలార్ రూఫ్ వెండర్స్, పులి రమణారెడ్డి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పోస్టాఫీస్ కార్యాలయం మార్పు



శాతవాహన నగర్‌కు పోస్టాఫీస్ తరలించినట్టు ఏర్పాటు చేసిన బోర్డు

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డులోని వడ్లపూడి పోస్టాఫీస్‌ను 86వ వార్డు కూర్మన్నపాలెం శాతవాహన నగర్ రోడ్డు నంబర్–1లో తరలించినట్టు పోస్టల్ అధికారులు తెలిపారు. గతంలో కొనసాగిన పోస్టాఫీస్ భవనం వద్దకు తరలిస్తున్నట్టు బోర్డును ఏర్పాటు చేస్తూ వివరంగా చిరునామాతో వేలాడదీశారు. పోస్టల్ వినియోగదారులు గమనించాలని అధికారులు కోరారు.

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ. 19.9 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సేవకులు

కంచరపాలెం : జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు గురువారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. 61 రోజులకు గాను అమ్మవారి ముడుపులు, ప్రత్యేక దర్శనాలకు సంబంధించి రూ.19,09,971 వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. సహాయ కమిషనర్, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి. వసంతకుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏపీబీవీ బ్యాంక్, కంచరపాలెం పోలీస్ సిబ్బంది, కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ ఉద్యోగులు, శ్రీవారి స్వచ్ఛంద సేవకులు తదితరులు లెక్కింపులో పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెంలో అన్నసమారాధన



అన్నసమారాధన నిర్వహిస్తున్న గ్రామ నాయకులు



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న కరణరెడ్డి నరసింగరావు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో వినాయకచవితిని పురస్కరించుకొని భారీ అన్నసమారాధన నిర్వహించారు. గురువారం గ్రామంలో మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన అన్నసమారాధనలో 5 వేలకు మందికిపైగా భక్తులు అన్నప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కొండయ్యవలసలో..

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ కొండయ్యవలసలో మెగా రెబల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గురువారం విశేష అన్న సమారాధన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీవెంకటేశ్వరస్వామి రూపంలో ఏర్పాటు చేసిన వినాయకునికి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ బి.నాగరాజు, పీకేసీ ట్రస్ట్ చైర్మన్ పల్లా కార్తిక్, వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్ దంపతులు, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ. బండారు చందు, పలక అచ్చుత్, పట్టా పైడిరత్నం తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడలో..

పెదగంట్యాడ: మండల పరిధిలో పలు ప్రాంతాల్లో శ్రీ వరసిద్ధి వినాయక మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా జీవీఎంసీ 74వ వార్డు పరిధి దయాల్‌నగర్‌లో పేర్ల సత్యారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండం వద్ద గురువారం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని గాజువాక నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పల్లా రమణ, సత్యనారాయణ, కన్నబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దీపారాధన



దీపారాధనలో పాల్గొన్న భక్తులు

పెదగంట్యాడ: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణనాథునికి దీపారాధన చేశారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరులో సీజీ స్టార్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా గణపతి మండపం వద్ద గురువారం మహిళలు దీపారాధనతో ఆకట్టుకున్నారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శివలింగం.. ఓం, వినాయకుడు, స్వస్తిక్ రూపాలలో దీపాలు వెలిగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దీపాలంకరణలో పాల్గొన్నారు. ముందుగా గణపతికి విశేష పూజలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో సీజీ స్టార్ యూత్ సభ్యులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

పోరాడి సాధించుకున్న ఉక్కును కాపాడుకుంటాం



దీక్షా శిబిరం వద్ద కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కార్మికులు



ఉక్కు రిలే దీక్షా శిబిరంలో పాల్గొన్న పరిరక్షణ కమిటీ నాయకులు

అగనంపూడి: నిర్వాసితులు వేల ఎకరాల ధారాదత్తం, 32 మంది అమరుల ప్రాణ త్యాగంతో, పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తామంటే రాష్ట్ర ప్రజలు చూస్తూ ఊరుకోరని, సమయం వచ్చినప్పుడు తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొక తప్పదని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రకటనకు నిరసగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల నేతృత్వంలో 1,309 రోజుల నుంచి రిలే దీక్షా శిబిరం నిర్వహిస్తున్నారు. దీక్షా శిబిరంలో ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉక్కు కర్మాగారాన్ని అస్థిరపర్చి, కార్మికుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయాలని చూస్తోందని, ఇటువంటి దుశ్చర్యలను కార్మిక వర్గం వ్యతిరేకిస్తుందన్నారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా, పోరాటలు, ఉద్యమాలతో అడ్డుకుంటామన్నారు. తక్షణం ఉక్కును సెయిల్‌లో విలీనం చేసి, పూర్తి సామర్థ్యంతో ఉక్కును నడిపేందుకు వీలుగా ముడి సరుకులు అందివ్వాలని, అవసరమైన ఆర్థిక సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ, కె.రాజబాబు, బీఎంఎల్ నాయుడు, పి.పెద్దిరాజు, బీవీ సత్యనారాయణ, సైన్‌బాబు పాల్గొన్నారు.

సామాజిక సేవలో గంగవరం పోర్టు



పెదగంట్యాడలోని ఓ గెడ్డలో జేసీబీ సాయంతో పూడిక తొలగిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: కష్ట సమయాల్లో సమాజానికి అండగా ఉండాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని అదాని గంగవరం పోర్టు యాజమాన్య ప్రతినిధులు అన్నారు. భారీ వర్షాల కారణంగా ఉత్తరాంధ్ర జిల్లాలోని అనేక గెడ్డలు పూడుకుపోయాయని, వాటిని తొలగించేందుకు మున్సిపల్ అధికారులు విజయవాడ వెళ్లడంతో తమ వంతు సాయంగా యంత్ర పరికరాలు, ప్రత్యేక బృందాలను ఆయా జిల్లాలకు తరలించామని తెలిపారు. తీవ్రమైన వాతావరణ పరిస్థితుల కారణంగా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలోనూ అదాని గంగవరం పోర్టు తన వంతు ప్రయత్నాలు చేస్తోందని వివరించారు. ఇందులో భాగంగా జిల్లాలో పూడుకుపోయిన గెడ్డలను శుభ్రం చేయించామని చెప్పారు. గాజువాక, పెదగంట్యాడ మండలాల్లో తమ సేవలను విస్తరించామన్నారు.

భారీ వర్షాలు కురిసే సమయంలో వర్షపునీరు సాఫీగా సాగిపోయేలా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. అలాగే రహదారుల్లో కూడా ఎక్కడా చెత్తాచెదారం పేరుకు పోకుండా, వర్షపునీరు నిలిచిపోకుండా ఉండేలా పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టామన్నారు. గత నెల 31 నుంచి సేవలు చేస్తున్నామని, ఇది తమ పోర్టు సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.

ట్రాఫిక్ ఎస్ఐగా మహాలక్ష్మి బాధ్యతల స్వీకరణ



మహాలక్ష్మి

పెదగంట్యాడ: న్యూపోర్టు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా జీఎస్‌వీ మహాలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. దువ్వాడ పోలీస్‌స్టేషన్ ట్రాఫిక్ ఎస్ఐ గా పనిచేసిన ఈమె బదిలీపై ఇక్కడిక వచ్చారు. ఆమెకు సిబ్బంది శుభాకాంక్షలు చెప్పారు.

జీవో 115 రద్దు చేయాలి



విమ్స్ ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేస్తున్న నర్సింగ్ సిబ్బంది

ఆరిలోవ: ఆస్పత్రుల్లో నర్సింగ్ సిబ్బందికి ఇబ్బందిగా మారిన జీవో నంబర్ 115ను వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలని విమ్స్ నర్సింగ్ సిబ్బంది కోరారు. ఈమేరకు గురువారం విమ్స్ ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేపట్టారు. జీవో 115 రద్దుతోపాటు కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్టాఫ్ నర్స్ జయరాజు మాట్లాడుతూ నాలుగేళ్ల పాటు కష్టపడి నర్సింగ్ చదువుకుని కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న వారికి ఈ జీవో వల్ల నష్టం కలుగుతుందన్నారు. 2010 నుంచి ఇంతవరకు నేరుగా స్టాఫ్ నర్సులను భర్తీ చేయలేదని చెప్పారు. ఈ పోస్టుల కోసం ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నామన్నారు. ఇప్పుడు ఏఎన్ఎంలను నేరుగా స్టాఫ్ నర్సులుగా భర్తీ చేయడం వల్ల తాము నష్టపోతున్నట్లు తెలిపారు. ఏఎన్ఎంలకు జీఎన్ఎం శిక్షణ ఇచ్చి స్టాఫ్ నర్సులుగా భర్తీ చేయడం మంచి పద్ధతి కాదని సూచించారు. కార్యక్రమంలో నర్సులు భారతి, భరత్, శాంతి, శ్రావణి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.